కౌకూర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ కౌకూర్‌లోని ధరణి ఎన్‌క్లేవ్‌, భరత్‌నగర్‌లో విద్యుత్‌ సమస్యలను తగ్గించడానికి రూ.4.5 లక్షల విలువైన 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌, కాలనీ వాసులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. డివిజన్‌ పరిధిలోని విద్యుత్‌ సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌ నేతలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణ కమిటీ నియామకం



కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అల్వాల్‌: టెంపుల్‌ అల్వాల్‌ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం పునరుద్ధరణ (రినోవేషన్‌) కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌రెడ్డి, ఆలయ వంశపారంపర్య చైర్మన్‌ రాజాసం జయ్‌గోపాల్‌ సైంచర్‌, కార్యనిర్వాహణ అధికారి వీరేశం చేతులమీదుగా 12 మంది సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. రాంచంద్రరావు, వెంకట్రామిరెడ్డి, రవి, శ్రీనివాస్‌గౌడ్‌, వెంకటేష్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, శేఖర్‌, బాలకృష్ణ, నిమ్మ సుమతిరెడ్డి, విజయలక్ష్మి, శారద ఉన్నారు.

నిమజ్జనానికి రోడ్ల ప్యాచ్‌వర్క్స్‌ పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: గణనాథుడి మహా నిమజ్జనం సందర్భంగా పనులు వేగవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్‌ శ్రవణ్‌ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులకు సూచించారు. బుధవారం సఫిల్‌గూడ ట్యాంక్‌బండ్‌ వద్ద రహదారుల ప్యాచ్‌వర్క్స్‌ను పరిశీలించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. నిమజ్జన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. ప్రధాన రహదారుల్లో విద్యుత్‌ దీపాలు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఈఈ లక్ష్మణ్‌, డీఈ మహేష్‌, ఏఈ నవీన్‌, వీఐ రమేష్‌ పాల్గొన్నారు.

ఆక్రమిస్తే విస్తరణెలా ?

రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదన.. మరోవైపు ఆక్రమణలు

- చోద్యం చూస్తున్న టౌన్‌ ప్లానింగ్‌ సిబ్బంది
- అధికారుల అలసత్వంతో సమస్య మరింత జటిలం



రోడ్డును ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు

కుషాయిగూడ: ఓ వైపు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు.. మరో వైపు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్రమణలపై టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అలసత్వంతో రోడ్డు విస్తరణ మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు కనెక్టివిటీ రోడ్లను ఏర్పాటు చేసే క్రమంలో మహాలక్ష్మినగర్‌ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిని విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇంటి యజమానులకు నోటీసులు

రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి 80 ఫీట్లకు మార్కింగ్‌ కూడా చేశారు. బాధితులకు టీడీఆర్‌లు అందజేసే దిశగా కార్యాచరణ జరుగుతున్న క్రమంలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

◆ ప్రస్తుతం ఉన్న నిర్మాణాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా కార్యాచరణ చేయకపోగా.. కనీసం అక్రమ నిర్మాణాలైనా అడ్డుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంపై టౌన్‌ ప్లానింగ్‌ అధికారులను ప్రశ్నిస్తే చర్యలు తీసుకుంటామని దాటవేస్తున్నారు. కానీ అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు.

రెసిడెన్షియల్‌లో కమర్షియల్‌ నిర్మాణాలు

రెసిడెన్షియల్‌ జోన్‌లో యథేచ్ఛగా కమర్షియల్‌ నిర్మాణాలు చేపడుతూ.. జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండికొడుతున్న పట్టింపు లేని అధికారుల తీరు విస్మయానికి గురిచేస్తోంది.

రోడ్డు విస్తరణకు మరింత జాప్యం..

చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును విస్తరించాలని అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. బాధితులు ఇప్పటికే పోరాటం సాగిస్తున్నారు. అధికారులు నిర్ణయించిన 80 ఫీట్ల విస్తరణకు బాధితులు అంగీకరించడం లేదు. 60 ఫీట్లు అయితేనే అంగీకరిస్తామంటున్నారు. ఇలాంటి సందర్భంలో ఉన్న ఇళ్లను తొలగించేందుకే అధికారులకు సవాలుగా మారితే.. కొత్త నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణదారుల వద్ద నుంచి అందుకుని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు..

మహాలక్ష్మినగర్‌ నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు వేళ్లే మార్గం ఇరుకుగా ఉంటుంది. టెర్మినల్‌ ప్రధాన మార్గం వైపు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాకపోవడంతో ఈ మార్గం గుండానే ప్రయాణికులు, వాహనదారులు, ఆటోవాలాలు టెర్మినల్‌లోకి వచ్చి వెళ్తుండంతో భారీగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది.

◆ రద్దీగా మారిన రోడ్డు మార్గంలో అక్రమ షెడ్ల నిర్మాణాలు చేపట్టినా.. ఉన్న రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

◆ రైల్వేస్టేషన్‌ మార్గంలో అక్రమ నిర్మాణాలపై ఆరా తీసి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాప్రా టౌన్‌ప్లానింగ్‌ విభాగం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.



చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సరైన సిబ్బంది లేకే పర్యవేక్షించలేకపోతున్నాం

మహాలక్ష్మీనగర్‌ నుంచి రైల్వేస్టేషన్‌ రోడ్డులో చిన్న చిన్న రేకుల షెడ్‌లు వేస్తున్నట్లు సమాచారం ఉంది. కానీ సరిపడా సిబ్బంది లేక ఫీల్డ్‌కు వెళ్లలేకపోతున్నాం. చైన్‌మెన్‌లకు డివిజన్ల బాధ్యతలు అప్పగించాం. రైల్వేస్టేషన్‌ రోడ్డులోని అక్రమ నిర్మాణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమోహన్‌, టౌన్‌ప్లానింగ్‌ డీసీపీ

క్రీడలతో ఆరోగ్యానికి మేలు



బ్యాడ్మింటన్‌ ఆడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహా

కాప్రా: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో ఆసక్తి పెంచుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కాప్రా సర్కిల్‌లో పర్యటించిన ఆయన ఫైర్‌ ర్యాలీ బ్యాడ్మింటన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడపై ఆసక్తి పెంచుకుని, ఉన్నతంగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై సీబీఐ దర్యాప్తుతో అన్ని విషయాలు బయటపడతాయన్నారు. జస్టిస్‌ పీసీ ఘోష్‌ కమిషన్‌ ఇచ్చిన నివేదికను కూడా జీవోలో పేర్కొని, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

◆ కల్వకుంట్ల కవిత అంశం వారి అంతర్గత కుటుంబానికి సంబంధించిందని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌ అంతర్గత విషయాలు తమకు అవసరం లేదన్నారు.

అకాడమీ ఏర్పాటు అభినందనీయం...

కాప్రా పరిధిలో బ్యాడ్మింటన్‌ అకాడమీ ఏర్పాటు అభినందనీయమని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాను ముందుంటానన్నారు. బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో అజయ్‌యాదవ్‌

బోడుప్పల్‌: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్‌ మాజీ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. చెంగిచర్ల 3వ డివిజన్‌ పరిధిలో రూ.25లక్షలతో సీసీరోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభించిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మాజీ కార్పొరేటర్‌ కొత్త చందర్‌గౌడ్‌, మాజీ కో- ఆప్షన్‌ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్‌, విక్రమ్‌గౌడ్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

‘అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్‌ కృషి’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, టీపీసీసీ రాష్ట్ర నాయకులు గజ్జల కాంతం

గౌతంనగర్‌: అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్‌ నేత గజ్జల కాంతం అన్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో అన్ని పార్టీలను ఒప్పించి ఏకగ్రీవ తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున టీటీడీ దేవస్థానం తెలంగాణ ప్రాంత స్థానిక కమిటీ సభ్యులు రమణారెడ్డి ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, బీ–బ్లాక్‌ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్‌, బీకే.శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌, రమణారెడ్డి, నిరంజన్‌, ప్రవీణ్‌, యూసుఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించడంలో విఫలం



మాట్లాడుతున్న అన్నపూర్ణ సొసైటీ కాలనీవాసులు

గౌతంనగర్‌: అన్నపూర్ణ సొసైటీలో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని అన్నపూర్ణ సొసైటీ కాలనీవాసులు రమణారెడ్డి ఆరోపించారు. బుధవారం సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిటీకి నడిబొడ్డున ఉన్న ఈ సొసైటీ 3 నియోజకవర్గాల మధ్య ఉందని, సొసైటీకి మహేంద్రహిల్స్‌, సికింద్రాబాద్‌, మల్కాజిగిరికి లింక్‌ రోడ్డు ఉందన్నారు. వర్షం వచ్చిన ప్రతిసారి వరదనీరు అన్నపూర్ణ సొసైటీని ముంచెత్తుతుందన్నారు. దీనివల్ల ఇళ్లలోకి వరద నీరుచేరి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. అధికారులు స్పందించి దశాబ్దకాలంగా వరద నీటి సమస్యలతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. లేదంటే 3000 ఓట్లు ఉన్న అన్నపూర్ణ సొసైటీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కాలనీవాసులు రమణారెడ్డి, జగన్మోహన్‌రావు, కిషన్‌, లక్ష్మణ్‌, దేవేందర్‌, సుగుదేవ్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

క్యాత్‌ ల్యాబ్‌ ప్రారంభం

మేడ్చల్‌: పట్టణంలోని మెడినోవా సూపర్‌ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో ఉపయోగపడే క్యాత్‌ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. మెడిసిటీ ఆసుపత్రి గ్రూపులో భాగమైన మెడినోవా ఆసుపత్రిలో ఆధునిక క్యాత్‌ ల్యాబ్‌ అందుబాటులో ఉండటం వల్ల మేడ్చల్‌ ప్రాంతంలో 24/7లో గుండె పరిరక్షణకు ల్యాబ్‌ దోహదం చేస్తుందని వైద్యులు తెలిపారు. హార్ట్‌ ఎటాక్‌ నిర్వహణ, యాంజియోప్లాస్టీ, యాంజియోగ్రఫీ, పేస్‌మేకర్‌ ప్రక్రియ, వంటి సేవలను ల్యాబ్‌ అందిస్తుందని తెలిపారు. వైద్యులు డాక్టర్‌ జగదీష్‌రెడ్డి, సీఈఓ ఇనీష్‌ మర్చంట్‌, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కీసర: విద్యార్థులు పట్టుదలతో చదవాలని ప్రముఖ న్యాయవాది బోడల శ్రీనివాస్‌రావు, సీనియర్‌ జర్నలిస్ట్‌ గణేష్‌ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులో పోటీతత్వం పెంచేందుకు ఛాలెంజ్‌ ట్రోఫీని ఆవిష్కరించారు. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 2024–2025 సంవత్సరంలో ప్రథమ స్థానంలో నాగారం ప్రభుత్వ పాఠశాల ట్రోఫీని దక్కించుకుంది. ఈ ట్రోఫీని బుధవారం కీసర పాఠశాలకు సర్టిఫికెట్‌ ప్రదానం చేశారు. తిరిగి సర్టిఫికేట్‌ను దక్కించుకునేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు.

‘హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలం’



సమావేశంలో మాట్లాడుతున్న మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్‌: ఎన్నికల సమయంలో అలివిగాని వాగ్దానాలు చేసి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్‌ పార్టీ మోసం చేసిందని బోడుప్పల్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి వందలాది ఎకరాలను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్‌ ప్రభుత్వం నిరాధారణమైన ఆరోపణలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్‌ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. బోడుప్పల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్‌ తరుపున పోరాటం కొనసాగిస్తామన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్‌, రవికుమార్‌, నర్సింహ్మ, సామల మనోహర్‌రెడ్డి, రాసాల మహేష్‌యాదవ్‌, శ్రీనివాస్‌, అలీ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర డిగ్రీ కళాశాలకు బస్సు విరాళం



బస్సును ప్రారంభిస్తున్న చినజీయర్‌ స్వామి, ఈసీఐఎల్‌ చైర్మన్‌, ఎండీ అనురాగ్‌కుమార్‌

కుషాయిగూడ: ఎలక్ట్రానిక్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ (ఈసీఐఎల్‌) ఆధ్వర్యంలో బుధవారం నేత్ర డిగ్రీ కళాశాల (బ్లైండ్‌)కు సీఎస్‌ఐఆర్‌ కింద బస్సును విరాళంగా అందజేసింది. తెలంగాణలోని శంషాబాద్‌ ముచ్చింతల్‌లోని చినజీయర్‌ ఇంటిగ్రేటెడ్‌ వేదిక్‌ యూనివర్సిటీకి చెందిన నేత్ర విద్యాలయ డిగ్రీ కళాశాల (కాలేజ్‌ ఫర్‌ బ్లైండ్‌)కు 33 సీట్ల బస్సును కళాశాలకు విరాళంగా ఆ సంస్థ ఎండీ అనురాగ్‌కుమార్‌ అందజేశారు. చినజీయర్‌ స్వామి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో తమ వంతు మద్దతు తెలిపిన ఈసీఐఎల్‌ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసీఐఎల్‌ ఓఎస్‌ అండ్‌ డైరెక్టర్‌ డా.అనేష్‌కుమార్‌శర్మ, ఫైనాన్స్‌ డైరెక్టర్‌ ప్రోతిక్‌ కుమార్‌ చక్రవర్తి తదితరులున్నారు. ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ మురళీధర్‌, ఎంఎస్‌ఆర్‌ఎస్‌ కంపెనీ కార్యదర్శి ప్రసాద్‌, డా.వేణుబాబు, రామకృష్ణ, సునీల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయక శరణం గణేశా.. !



నాచారంలో ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో గణపతి నవరాత్రుల సందర్భంగా వివిధ మండపాల్లో స్వామివారికి ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం పలు మండపాల వద్ద అన్నప్రసాద వితరణ జరిగింది. పలుచోట్ల డప్పు చప్పుళ్లు, సాంస్కృతిక నృత్యాలతో గంగమ్మ ఒడికి గణపయ్యను తీసుకెళ్తున్నారు. అన్నప్రసాద వితరణలో భాగంగా 108 ప్రసాదాలతో నైవేద్యం సమర్పించి గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

– ఉప్పల్‌/మల్కాజిగిరి జోన్ల బృందం



108 రకాల వంటకాలతో గణపయ్యకు నైవేద్యం



రామంతాపూర్‌లో ప్రత్యేక పూజల్లో రాజ్యసభ ఎంపీ ఆర్‌.కృష్ణయ్య



లడ్డూను దక్కించుకున్న నీలం లతాశ్రీనివాసులు దంపతులు



గౌతంనగర్‌ టాలెంట్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో..



చెంగిచర్ల వినాయక పూజల్లో మాజీ మేయర్‌ అజయ్‌యాదవ్‌



చిలుకానగర్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ బన్నాల గీత తదితరులు



ఇందిరానెహ్రూనగర్‌లో టీటీడీ సభ్యులు రమణారెడ్డి



ఆనంద్‌బాగ్‌లో బీజేపీ నాయకురాలు మాధవీలత



ఉప్పల్‌ భగాయత్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌లో ఎమ్మెల్యే బండారి ప్రత్యేక పూజలు



సుప్రభాత్‌ కల్చరల్‌ అసోసియేషన్‌లో..



పీర్జాదిగూడలోని శ్రీసాయి ఆనందమయి గేటెడ్‌ కమ్యూనిటీలో..



గణపతి పూజలో హబ్సిగూడ కార్పొరేటర్‌ చేతన